క్లుప్తంగా

సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ కామేశ్వరి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్రాంత వీఆర్వో రవిఅంబేడ్కర్ ప్రోద్బలంతో గురుకులానికి సావిత్రిబాయి పూలే విగ్రహంతో పాటు గోడ గడియారాన్ని బహూకరించిన దాత పాణెం లక్ష్మీసునీతకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ అంబూరు సుబ్రహ్మణ్యం, న్యాయవాది జీఆర్అంబేడ్కర్, ఎంబేటి శ్రీనివాసులు, దావా పెంచల రావు, కృష్ణప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండారుపల్లి పాఠశాలలో తనిఖీలు

ఆత్మకూరురూరల్: బండారుపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలను ఆత్మకూరు ఎంఈఓ–2 చలపతి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. బోధన తీరుపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట హెచ్ఎం పెంచలయ్య, ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన సమగ్రశిక్ష ఏపీసీ



మర్రిపాడు: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య శనివారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో ముచ్చటించి సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మండల విద్యావనరుల కార్యాలయాన్ని సందర్శించి నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. ఆయన వెంట ఎంఈఓ–2 ధనలక్ష్మి, కేజీబీవీ స్పెషల్ ఆధికారి లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సన్మానం



పల్లాల కొండారెడ్డికి సత్కారం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పల్లాల కొండారెడ్డి, జనరల్ సెక్రటరీగా నియమితులైన గణపం రమేష్‌ను పలువురు నాయకులు శనివారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నేతలు చిన్నికృష్ణారెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, కొంకల వెంకటేశ్వర్లు, పల్లాల ప్రసాద్‌రెడ్డి, చీమల హాజరత్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. 12 వార్డుకు చెందిన గొల్లపల్లి నారయ్య, 12వ వార్డుకు చెందిన పీ తిరుపతమ్మ, 15 వార్డుకు చెందిన కల్లూరు పోలమ్మ, 16వ వార్డుకు చెందిన షేక్ రహీంసా, 23వ వార్డుకు చెందిన షేక్ రియాజ్‌లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు ట్రస్టు సభ్యుల ద్వారా రూ.10వేలు చొప్పున నగదు సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, ప్రసాద్ రెడ్డి, నరసింహారెడ్డి, పులిమి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కదాడిలో వ్యక్తికి గాయాలు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో షేక్ జానీబాషా అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి పిచ్చి కుక్క దాడి చేసింది. మంచినీటి పథకం మోటార్ వేసేందుకు వెళ్తుండగా పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు గమనించి కుక్కను తరిమి స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు.

ఏడీఎంహెచ్ఓ తనిఖీలు

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా లెప్రసి కంట్రోల్ అధికారి ఖాదర్‌వలి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్యసే వలపై ఆరాతీసి ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. క్షయ నివారణకు కృషి చేయాలన్నారు.



సంక్రాంతి సమీపిస్తున్నా... కనిపించని ఊరి బంధువులు

పల్లెల్లో జాడలేని హరిదాసులు, గంగిరెద్దులు, జంగమదేవరులు

• కనుమరుగవుతున్న సంప్రదాయ కళలు



గంగిరెద్దుల వారు



హరిదాసు



జాతకం చూస్తున్న కాటిపాపడు

ఉదయగిరి: ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే పల్లెల్లోనెల రోజుల ముందు నుంచే సందడి మొదలయ్యేది. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి హరిలో రంగ హరి అంటూ హరిదాసులు..అంబ పలుకు జగదంబ పలుకు అంటూ బుడబుక్కల వారు..అయ్యవారికి దండం పెట్టు..అమ్మవారికి దండం పెట్టూ అంటూ గంగిరెద్దుల వారు..శంఖం ఊదుతూ జంగందేవరులు సందడి చేసే వారు. సంక్రాంతి పండగకు ముందు బంధువులు వస్తే.. పండగ నెల పెట్టినప్పటి నుంచే 'ఊరి బంధువులు' కనిపించేవారు. 'సంప్రదాయ కళలకు పట్టం కడుతూ ఊరూవాడా తిరుగుతూ పల్లెవాసులు ఇచ్చిన ధన ధాన్యాలను పుచ్చుకుంటూ ఆశీర్వదించి వెళ్లే వారు. కానీ నేడు పల్లెల్లో ఊరి బంధువులు కనిపించడం లేదు. మారిన కాలంతో మనుషుల తీరు మారింది. మార్పు అనివార్యమైంది. దీంతో సంప్రదాయ కళలు కాలగర్భంలో కలిసిపోతూ భవిష్యత్తు తరాల వారికి పాత తరం వారి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించిన రోజు నుంచి పండగ నెల ప్రారంభమవుతుంది. ఈ నెల అంతా పల్లెల్లో ఒకటే సందడి. పంటలు ఇంటికి చేరే వేళ... కల్లాల్లో ధాన్యరాశుల సిరులు.. గ్రామీణులు రోజంతా పొలం పనులు చేసి అలిసిపోయి నోట్లో ముద్ద పడగానే నిద్రమత్తులోకి వెళ్లిపోతారు. వేకువ జామున నాలుగు గంటలకే లేచి గృహిణులు ఇంటి పనుల్లో...మగవారు పొలం పనులకు సమాయత్తమవుతారు. ఇంతలో సంకీర్తనలు పాడుతూ హరిదాసులు...డూడూ బసవన్నలతో విన్యాసాలు చేస్తూ గంగిరెద్దులవారు..అంబపలుకు జగదంబ పలుకు అంటూ బుడబుక్కలు వారు..శంఖం ఊదుతూ జంగం దేవరలు...ఏడాదికో మారు అంటూ పిట్టల దొరలు..పగటి వేషగాళ్లు..బుడ్రాజులు..కనికట్టు చేసే కాటిపాపలు..గారడి చేసే వారు ఇలా క్యూ కడుతూ పల్లెలో సందడి చేసేవారు.. ఊర్లలోని ఇంటింటికి తిరుగుతూ తమ కళలను ప్రదర్శిస్తూ యజమానులు ఇచ్చే ధనధాన్యరాశులను స్వీకరించేవారు. ఈ సంప్రదాయ కళలతో పల్లె జీవనానికి ఎంతో అనుబంధం ఉండేది. అయితే మారుతున్న కాలంలో ఆదరణ తగ్గి ఉపాధి లేక అనేక మంది కళాకారులు వేర్వేరు వృత్తుల్లో స్థిరపడ్డారు. చాలా కొద్దిమంది మాత్రమే పూర్వీకుల నుంచి వస్తున్న విద్యను ప్రదర్శిస్తూ సంప్రదాయ కళలను కాపాడుతూ వస్తున్నారు. వీరిని కూడా వేళ్ల మీద లెక్కించొచ్చు. ఇప్పటికే కళాకారులు, వృత్తుల వారు కనుమరుగయ్యే చరమమాంక దశలో ఉన్నారు. భవిష్యత్తు తరాలకు వీరిని చూసే భాగ్యం లేకపోవచ్చు. కేవలం పుస్తకాల్లో చదివి, సోషల్ మీడియాలో చూసే కాలం ఎంత దూరంలో లేకపోవచ్చు.

కనిపించడం లేదు



మా చిన్నతనంలో పండగ నెల వచ్చిందంటే ఊర్లలో సందడి మొదలయ్యేది. హరిదాసులు, జంగమదేవరలు, బుడబుక్కలు, గంగిరెద్దుల వారు ఇంటింటికి వచ్చి సందడి చేసేవారు. కుటుంబ యజమానులు కూడా వారిని అంతే ఆదరించేవారు. కానీ నేడు వారంతా కనిపించడం లేదు. ఏటా వచ్చే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎవరూ రాలేదు. పండగ రోజు ఒక్కరు ఇద్దరు రావచ్చు. అప్పటి రోజులతో పోల్చుకుంటే ఎంతో తేడా ఉంది.

–కొనిశెట్టి, వరికుంటపాడు

800 మందికి చలికోటుల వితరణ



ఉదయగిరి: గండిపాళేనికి చెందిన 800 మందికి జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైఎస్ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.3లక్షల విలువైన చలికోటులను శనివారం వితరణ చేశారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గండిపాళెంలోని తన నివాసం వద్ద ట్రస్టు ప్రతినిధుల ద్వారా చలికోటులను పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు బుడంగుంట్ల వెంకటేశ్వర్లు, పాముల రాజా, అన్నాబత్తిన మాధవ, స్థానికులు రాపల్లి తిరుపతి, గొల్లపల్లి రమేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

11నుంచి క్రికెట్ టోర్నమెంట్

సోమశిల: సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 11న అనంతసాగరంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సాధిక్, సుభాని, ముజ్జు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన జట్లు ఈ నెల 9వ తేదీలోగా ఎంట్రీ ఫీజు రూ.999 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 89858 38985, 83749 85108, 93984 8648 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బ్రెయిలీ లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు



కావలిలోని భవిత కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న సహిత ఉపాధ్యాయినులు



అనంతసాగరంలో బ్రెయిలీకి నివాళులు



ఆత్మకూరులో విజేతలకు బహుమతుల ప్రదానం



ఉదయగిరిలో..

కావలి: అంధుల కోసం ప్రత్యేకంగా చుక్కల లిపిని రూపొందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని సహిత ఉపాధ్యాయినులు కే మమత, ఎం లక్ష్మి కొనియాడారు. పట్టణంలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రెయిలి లిపి వల్లే నేడు అంధులు ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. సామాజిక కార్యకర్త డాక్టర్ కూరపాటి మాధవరెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ జీవిత విశేషాలను వివరించారు.

సోమశిల: అనంతసాగరంలోని భవిత సెంటర్‌లో బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ బట్రెడ్డి లక్ష్మీప్రసన్న ముఖ్య అతిథిగా హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంధ విద్యార్థులతో బ్రెయిలీ లిపీని చదివించారు. బ్రెయిలీ లిపి ద్వారా అక్షరాలు నేర్పిస్తున్న సహిత ఉపాధ్యాయిని సౌజన్యను అభినందించారు. ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అంధుల కోసం బ్రెయిలీ ఆరు చుక్కలను ఉపయోగించి రూపొందించిన లిపిని నేడు ప్రపంచంలోని అన్ని దేశాలు వాడుతున్నాయన్నారు. నేడు అంధుల కోసం బ్రెయిలీలిపిలో ప్రత్యేకంగా దినపత్రికలు సైతం వెలువడుతున్నాయని తెలిపారు. ఐఆర్టీలు నరసింహ, బాలభారతి,ఉపాధ్యాయులు మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వై సీతాదేవి ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చుక్కల లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బ్రెయిలీ అని కొనియాడారు. ఆయన జయంతిని ఏటా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, మంజులవాణి, శశికళ, పద్మమ్మ, ధనమ్మ, ఐఈఆర్‌పీ జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి హెచ్ఎం షబ్బీర్ పూలమాలవేసి నివాళులర్పించారు. బ్రెయిలీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహ, ఐఆర్పీలు శివనందిని, సుభాష్‌చంద్రబోస్, అంగన్‌వాడీలు సంజీవరాణి, స్వర్ణ పాల్గొన్నారు.

9న దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

సోమశిల: అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 9న దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శనివారం తెలిపారు. వెంకటాచలంలోని సీఆర్సీ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు,తదితర పరికరాలను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్‌కార్డులు, వయోవృద్ధులు రేషన్, ఆధార్ కార్డులు, రెండు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు.

పది విద్యార్థులకు ప్రేరణ తరగతులు

ఉదయగిరి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ తరగతులను గండిపాళెంలోని ఏపీ బాలుర గురుకుల పాఠశాల, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. మోటివేటర్ వీ నారాయణ సూచనలు, సలహాలను అందజేశారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



కలిగిరి: లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని కందులవారిపాళెం నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉపసర్పంచ్ కందుల వెంకటరమణమ్మ చొరవచూపి శనివారం గ్రావెల్‌ను తోలించారు. రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

• డ్వామా పీడీ గంగా భవాని



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

అనుమసముద్రంపేట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, దళితవర్గాలకు చెందిన వారు తమ పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించి బాగా చదివించాలని డ్వామా పీడీ గంగాభవాని సూచించారు. శనివారం ఆమె ఏఎస్‌పేటలో పర్యటించారు. ఇందిర జలప్రభ పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన పొలాలను సాగు చేసుకోవాలని సూచించారు. మామిడి తోటల్లో ఉపాధి హామీ పథకం కింద పంట కుంటలు తవ్వుకోవడం వల్ల చెట్లకు సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు దళితులు డీకేటీ పట్టాలు మంజూరు చేయించాలని కోరారు. ఉద్యానశాఖ అధికారి లక్ష్మి మాట్లాడుతూ కొత్తగా మామిడి మొక్కలు వేసుకునే రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.7వేలు ఇస్తుందని తెలిపారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీడీ నారాయణరావు, సర్పంచ్ కుదారి హజరత్తమ్మ, ఎన్ఆర్‌జీయస్ అధికారులు సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నేటికి వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ పర్యటన వాయిదా

అనుమసముద్రంపేట మండలంలో వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ పర్యటన ఆదివారానికి వాయిదాపడినట్లు డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. వనమెన్ కమిషన్ చైర్మన్ శనివారం పర్యటించాల్సి ఉన్నా అనివార్య కారణాలతో వాయిదా పడినట్లుగా తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



ఆత్మకూరు కళాశాలలో భోజనం పంపిణీ

కొండాపురం/ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు వచ్చే పేద విద్యార్థులు భోజనానికి ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీహరి, టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు, యారం కృష్ణ య్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపల్ కిరణ్ ప్రారంభించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బాలకేశవులు, నాయకు లు బయన్న, రియాజ్, బీ నరసింహులు, జీ వెంకటేశ్వర్లు, ఎన్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు/చేజర్ల: ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపల్ కే వాణిశ్రీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకట రమణమ్మ, వైస్‌చైర్మన్ ఎస్‌కే సర్దార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు.కళాశాలలోని 450 మంది విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరేలా విద్యార్థులు చక్కగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాల, స్వగ్రామాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హైస్కూల్ హెచ్ఎం అనంతలక్ష్మి, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, గంధళ్ల వేణు, పులిమి శైలజ, ఐవీ రమణారెడ్డి, చంద్రా వెంకట సుబ్బానాయుడు, బుజ్జిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పీ లక్ష్మారెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డి, చలమారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పదవులపై హర్షం



కనమర్లపూడి వెంకటనారాయణ



నీలం సాయికుమార్



గంధం ప్రసన్నాంజనేయులు



నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి



వాయిల కృష్ణమూర్తి



మేకల శ్రీనివాసులు



పోలేపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి

కావలి/అల్లూరు: కావలి నియోజకవర్గానికి చెందిన పలువురికి వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పదవులు లభించాయి. పట్టణానికి చెందిన కనమర్లపూడి వెంకటనారాయణ జిల్లా ఉపాధ్యక్షుడిగా, అల్లూరుకు చెందిన నీలం సాయికుమార్ ప్రధాన కార్యదర్శిగా, గంధం ప్రసన్నాంజనేయులు కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే దగదర్తి మండలం చెన్నూరుకు చెందిన పోలేపల్లి అనిల్ కుమార్‌రెడ్డి కార్యనిర్వాహక కార్యదర్శిగా, కావలికి చెందిన నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం పంచాయతీ నట్టు గ్రామానికి చెందిన వాయిల కృష్ణమూర్తి కార్యదర్శులుగా, బోగోలుకు చెందిన మేకల శ్రీనివాసులు అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



వల్లభనేని రాజేంద్రనాయుడు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: ఆత్మకూరుకు చెందిన పలువురికి వైఎస్సార్‌సీపీలో పదవులు లభించాయి. పట్టణానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు సీహెచ్ ఆదిశేషయ్య పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదిశేషయ్యను సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే మండల వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్‌గా పనిచేస్తున్న వల్లభనేని రాజేంద్ర జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. గత ఎన్నికల సమయంలో పార్టీకి రాజేంద్ర అందించిన సేవలను గుర్తించి జిల్లా స్థాయి పదవి బాధ్యతలు అప్పగించడంపై జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ధనాల రమేష్ నాయుడు, నెట్టెం పిచ్చయ్య నాయుడు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.




ఆదిశేషయ్య దంపతులకు సత్కారం



బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరం మండలానికి చెందిన బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, అనంతసాగరం జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



షేక్ కరిముల్లా

సంగం: మండలం తలుపూరుపాడుకు చెందిన షేక్ కరిముల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తనకు పదవి బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'స్రైడ్'కు పురస్కారం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన స్రైడ్ స్వచ్ఛంద సేవా సంస్థకు మదనపల్లికి చెందిన గ్రామజ్యోతి సొసైటీ, ముంబైకు చెందిన ది మూమెంట్ ఇండియా, కేరళకు చెందిన యూఆర్‌సీ సంస్థలు సంయుక్తంగా పురస్కారాన్ని అందజేశాయి. గతేడాది నవంబరు19న ఏడు రాష్ట్రాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాక్ ఫర్ ఫ్రీడమ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళల అక్రమ రవాణాపై ప్రజలను చైతన్యపరిచారు. ఇందుకు సంబంధించి అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు పురస్కారాలను ప్రదానం చేశారు. అందులో భాగంగా స్రైడ్ డైరెక్టర్ వాగాల శ్రీహరికి గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర, ది మూమెంట్ ఇండియా ఆర్గనైజేషన్ డైరెక్టర్ శ్యామ్ జోషి, యూఆర్‌సీ జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అబ్రహం, మదనపల్లి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి అబ్రహం, తదితరుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు.

విద్యతో పేదరికాన్ని జయించవచ్చు



విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు(ఉదయగిరి): విద్యతో పేదరికాన్ని జయించవచ్చని, వసతిగృహ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకాంక్షించారు. వింజమూరు బీసీ కాలనీలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. విద్యార్థినులకు స్వీట్లు పంచిపెట్టి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి వారి సమస్యలపై ఆరాతీశారు. వసతిగృహంలో విద్యుత్‌దీపాలు సరిగాలేకపోవడంపై వార్డెన్‌పై అసహనం వ్యక్తం చేశారు.ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు మాలేపాటి చైతన్య, గొంగటి రఘు, జూపల్లి రాజారావు, వనిపెంట సుబ్బారెడ్డి, చేబ్రోలు వసంతరావు,నాగిరెడ్డి ఉన్నారు.

28న కాశీనాయన జయంతి వేడుకలు

సీతారామపురం : మండలంలోని బెడుసుపల్లిలో ఈ నెల 28న అవధూత కాశీనాయనస్వామి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆయన వంశీకులు శనివారం తెలిపారు. 28న మధ్యాహ్నం 12 గంటల నుంచి కాశీనాయనస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. 108 మంది మహిళలతో జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రెవెన్యూ సదస్సుకు 51 వినతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీ సుధీర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును శనివారం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వారి నుంచి భూసమస్యలపై 51 వినతులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీటీ స్వరూప్, మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి, గంధళ్ల వేణు, టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.